

▣ ఆకలితో రెచ్చిపోయిన పిచ్చి రాక్షసిలాగ, పొడుగ్గా సరుచుకొని ఉన్న రైలుమార్గాన్ని, ఆబగా మింగేస్తూ, నేను ప్రయాణం చేస్తూన్న మద్రాసు—హౌరా ఎక్స్‌ప్రెస్ విజయవాడ వేపు మహా వేగంతో దూసుకుపోతోంది. ఎప్పుడో పొద్దుటనగా గూడూరులో చేసిన భోజనం ఏమో, ఏలూరులో దిగిపోయే నాలాంటి ఏ కొద్దిమందివో తప్ప, ఎక్కువ దూరపు ప్రయాణీకు లంతా 'మీల్స్‌స్టాప్' అయిన విజయవాడ స్టేషను ఎప్పుడొస్తుందా, ఎప్పుడు భోజనం చేద్దామా అని తెగ ఆరాట పడుతున్నారు. ఇలా ప్రయాణీకులూ, ప్రయాణీకులతోబాటు ఎక్స్‌ప్రెస్సూ కృష్ణానదీవంతెన మీద సాయం సంధ్యా సమయంలో చేస్తూన్న ఆ ఆకలి తాండవం చూసి కాబోలు లక్షలాది ప్రజలకు అన్నం పెట్టే అన్నపూర్ణ లాంటి ప్రకాశం బేరేజీ, అప్పుడే వెలిగించిన మెర్క్యురీ చిరునవ్వులు నవ్వుతోంది దూరాన్నుంచి. -

స్లీపర్ కోచ్‌లోని ఆ అరలో, షడ్రుచులలా కూర్చున్న మా ఆరుగురిలోనూ ఆరు రకాలైన చైతన్యం బయలుదేరింది, రాబోయేది విజయవాడస్టేషన్ అని తెలియగానే.

అందులో, కిటికీ పక్కనే ఉన్న సీటులో కూర్చున్న నా సంగతి చెప్పనే అక్కర్లేదు! —విజయవాడ స్టేషను అంటే నాకు భలే సరదా... ఏమంటే, అప్పుడే బాంబులు పడ్డ ప్రదేశంలాగ, నల్లని పొగలతో, చెవులు చిల్లులుపడే చప్పుళ్లతో, వందలాది ప్రజల త్రొక్కిసలాటతో, రణగొణ ధ్వనిగా, చెప్ప లేనంత కోలాహలంగా, బలే తమాషాగా ఉంటుంది. ఆటంబాంబు పడుతూన్న హీరోషిమాను కానీ, పధ్నాలుగేళ్ల క్రితం ఇంచక్కా ఇన్నీసుపేట వీధులన్నీ వెన్నీసు వీధులలా మారి పడవలతోనూ, ప్రజల పెడబొబ్బలతోనూ నిండి ముచ్చటగా వరదలలో మునిగిన రాజమండ్రినికాని చూడలేదే అని, ఎప్పుడూ అవురు అవురు మంటూ నాలో పెద్ద పులిలా నోరు తెరుచుకొని ఉండే ఓ చిత్రమైన కోరికకి విందు భోజనంలా ఉంటుంది ఆ విజయవాడ స్టేషను సందడి. అందుకే జాగ్రత్తగా సర్దుకుని సిద్ధంగా కూర్చున్నాను కన్నుల విందుగా అనుభవించబోయే ఆ ఆనందాన్ని కమ్మగా ఊహించుకుంటూ.

నా పక్కని కూచున్న సిల్కు లాల్చీ శ్రీమంతుడిమీద కూడా, రాబోయే విజయవాడ స్టేషన్ ప్రభావం పడినట్టుంది. తనకి అటుప్రక్క కూర్చున్న గజ్జెల వడ్డాణపు సతీమణితో అప్పటిదాకా చెబుతూ వచ్చిన శ్రీమోరాజ్య స్థాపనామార్గాల్ని చటుక్కున ఆపుచేసి 'ఇంతకీ మీ తమ్ముడు స్టేషన్‌కి భోజనం తెస్తాడంటావా ?' అంటూ కిసుక్కున నవ్వాడు వ్యంగ్యంగా.

పాపం, ఆయన అంత శ్రమపడి చేసిన హేళనకి ఏమాత్రం ప్రాధాన్యం ఇయ్యకుండా, బెంచీలో సగం చోటుని సులువుగా ఆబరించుకొని నిండుగా కూర్చున్న ఆ సుకుమారి, తన రవ్వలదుద్దుల సీలల్ని ఓ మారు గట్టిగా తిప్పుకుని, కొత్తగా చేయించుకొన్న పాలగాజుల జతల్ని చేతిరుమాలుతో పోలిష్ చేసుకుంటూ 'బంగారం దర విజయవాడలో ఎలా ఉందో!' అంది, తనలో తను అనుకున్నట్టుగా పైకి

ఇంక అవతల బెంచీమీద సరిగ్గా నాకు ఎదురుగా నాలాగే కిటికీ ప్రక్కనే కూర్చుని లుంగీ జుబ్బా వేసుకునిఉన్న ఆసామీ లేచి, గోదాలోకి దిగే వస్తాదులాగ, లుంగీనోమారు గట్టిగా బిగించి, టిక్కెట్టూ చిల్లర డబ్బులూ తీసి చూసుకొని, తిరిగి జేబులో

వేసుకుంటూ 'ఈ విజయవాడ స్టేషన్‌లో అన్నం పేకెట్లు దొరుకుతాయో లేదో' అని తనలో తనోమారు అరవంలో గొణుక్కొని తిరిగి యథాస్థానంలో కూర్చున్నాడు.

అతనిపక్కనే ఖరీదైన ఇరుకు పేంటుతోనూ, పొట్టి టెర్లిన్ షర్టుతోనూ ఇమడలేక తెగ అవస్థపడుతున్నా', పైకి మాత్రం విలాసంగా కూర్చోడానికి ప్రయత్నం చేస్తూ, ఉన్న అరడజను అగ్గిపుల్లలు గీసి అలవాటులేని సిగరెట్టుని కాల్చడానికి నానా యాతనాపడుతూన్న కాలేజీ విద్యార్థి, తన ఎయిర్ బేగ్ బుజానికి తగిలించుకుంటున్నాడు విజయవాడలో దిగడానికి కాబోలు.

ఆ విద్యార్థిపక్కని కూచుని అప్పటిదాకా హనుమాన్ చాలీసా చదువుకుంటూన్న 'బీహారీ' ఆ పుస్తకాన్ని కళ్లకద్దుకొని సంచీలో పెట్టుకుంటూ పక్కనే సిగరెట్టు కాలుస్తూన్న అబ్బాయిని చూసి మొహం ఓమారు చిట్లించి, జేబులోంచి రెండు పైసల నాణెం ఓటి తీసి, కింద నిండుగా ప్రవహిస్తూన్న కృష్ణలో వేసి దణ్ణం పెట్టి, స్థిమితంగా స్వీట్లు కట్టిన మూటని విప్పుకోసాగాడు తినే టైము అయిందనుకుంటూ—

ఇలా తలోకరకం తలోక రకంగా సర్దుకునే లోపుగా స్టేషన్ రానేవచ్చింది; కీచ్... చ్...చ్...మంటూ ఆగిన రైలుశబ్దంతో పాటు అంతా ఒక్కమాటు ముందుకి తూలి పడ్డాము!

హమ్మయ్య

ఎప్పటినుంచో ఎదురు చూస్తూన్న అవకాశం ఇప్పటికి లభించిందికదా, అని ఆతురతగా కిటికీలోంచి తలదూర్చి చూద్దును కదా, ప్లాట్‌ఫారం కనిపించలేదు.

అయ్యో ప్లాట్‌ఫారం అటు! సందడి అంతా అటేఅన్నమాట!

ఇటు నేను కూర్చున్న కిటికీవైపు నిర్జనమైన స్మశానంలా, సందడిలేని లోతైన ఓ నల్లని అగాధం. ఈ అగాధానికి బారెడు దూరంలో, మసకచీకటిలో నల్లతాచుల్లా మెరుస్తూన్న ఇంకో లైనుతాలూకు రైలు పట్టాలు. ఇంకా వాటిమీదికి అటునుంచి రావలసిన సర్కార్ ఎక్స్‌ప్రెస్ రాలేనట్టుంది. అందుకే అవి అంతలోతున మెరుస్తూ శూన్యంగా భయంగా—

అప్పుడే వాన కురిసి వెలిసిందేమో, రాక్షసి బొగ్గు రవ్వలుపడి నల్లగామారిన నేలంతా తడితడిగా అయి, రైలుపొగా తడి మట్టి వాసనలతో నిండి, అంతా చిరాగ్గానూ, అసహ్యంగానూ ఉంది. చెదురు మదురుగా వెలుగుపడుతూ, కొండచిలువ ఒళ్ళులాగా పొడలు పొడలుగా మెరుస్తూన్న అలోతైన చీకటిని చూడలేక, తలతిప్పి అటువేపు ప్లాట్‌ఫారం కేసి చూశాను.

ఓ!... బ్రహ్మాండమైన జీవశక్తితో కూడిన కోలాహలం!

పళ్ళ ఫలహారాల, కిళ్లీసిగరెట్ల బళ్ళూ, వచ్చిపోయే పెట్టె బెడ్డింగులూ, వాటిని తప్పించుకుంటూ ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ కంగారుగా హడావుడిగా పరుగులెట్టే ఖరీదైన టెర్లిన్‌షర్టులూ, నీలం చొక్కాల ఎర్రతలపాగాలూ, ఆ వెనకాలే హంస నడకలు నడుచుకుంటూ వెళ్లే రంగు రంగుల చీరలూ, ఫేస్‌పౌడరు కళ తప్పిన ప్రయాణపు మొహాలూ, అమ్మకాల అరుపులూ, ప్రయాణీకుల కేకలూ, పెద్దల హెచ్చరికలూ, మధ్యలో నలిగిపోతూన్న పిల్లల ఏడుపులూ, ఇంజన్లకూతలూ వచ్చేపోయే రైళ్లచప్పుళ్లూ వీటితో రణగొణ ధ్వనిగా తుఫాను వచ్చిన మహాసముద్రంలా మాంచి అల్లకల్లోలంగా ఉంది ప్లాట్‌ఫారం.

ఎక్కే దిగే జనం రద్దీ అంతగా లేక తాపీగా ఉన్న మా స్లీపర్ కోచ్‌కి, ఒక వైపున ఇంత జీవ చైతన్యమూ, యింకో వైపున అంత నిర్జీవ నిశ్శబ్దమూనా ? ఎంత వ్యత్యాసం !

విద్యార్థి కాళీచేసి దిగిపోయిన సీటులోకి యింకా ఎవరూ రాలేదు. నా ఎదురుగా కూచున్న అరవ ఆసామీ, అటు ప్లాట్‌ఫారం వైపు అమ్ముతూన్న ఓ 'తైర్ సాదం' పేకెట్ కొని తెచ్చుకొని తన సీటులో కూర్చుని విప్పుకుంటున్నాడు...అతని ప్రక్కనున్న బీహారీ, మఠం వేసుకుని ఎడం చేత్తో కుడికాలిమండమీద విలాసంగా పావుకుంటూ, కుడిచేతిలోని మైసూరుపాకం యొక్క మాధుర్యాన్ని అర మోడ్పు కన్నులతో ఆస్వాదిస్తున్నాడు.

ఇక నా పక్కన కూర్చున్న సిల్కులాల్చీ ఆయన, అప్పుడే కేరియర్ తీసుకు వచ్చిన బావమరిదికి వెండి మరచెంబు అందించి మంచినీళ్లు తెమ్మని ఆజ్ఞాపిస్తే, అతని భార్య ఆ అల్యూమినం కేరియర్ కేసి చిరాగ్గా ఓమారు చూసి 'ఈ దిక్కుమాలిన కేరియర్ తప్ప వీడి కింకేం దొరకలేదు కాబోలు' అంటూ విసుక్కుని, కేరియర్ విప్పసాగింది.

చుట్టూ ఉన్న నలుగురూ భోజనం చేస్తూంటే, చెయ్యిని నేను అక్కడ ఉండడానికి మొహమాటం వేసింది. పైగా ప్లాట్‌ఫారంమీద వెల్లివిరుస్తూన్న ఉల్సాహం చెయ్యెత్తి పిలుస్తోంది, వచ్చి నువ్వు కూడా ఇందులో పాలుపంచుకోమని. నాకు అలాంటి రద్దీలో భాగస్వామి కావడం కూడా సరదాయే. అందుకే అలా ప్లాట్‌ఫారం మీదకి వెళ్లి ఆ వాతావరణంలో ఓమారు తృప్తిదీరా గాలి పీల్చి వద్దాం అని లేవబోయాను.

కాని ఇంతలో నా ఊపిరి స్తంభింపచేసేటంత భయంకరమైన మూలుగు వినిపించింది రైలుకి ఇటువైపునుంచి. నా ఎదురుగుండా ఉన్న అరవ ఆసామీ వెంటనే కంగారుగా కిటికీవేపు వీపుతిప్పేసి అటు తిరిగి, గబగబా, తైరుసాదం ముద్దలు నోట్లో కుక్కుకోసాగాడు.

ఆ మూలుగేమిటా, ఏమి చూసి ఈ అరవ ఆసామీ గతుక్కుమని మొహం తిప్పేసుకున్నాడా, అనే కుతూహలంతో వంగి కిటికీలోంచి వెలుగు చీకట్లవలలా ఉన్న ఆ అగాధంలోకి చూద్దునుగదా—

నల్లని ఓ మానవాకారం ఆ మసక చీకట్లో మెదిలింది. అంతలోతున నిలబడి ఇంత ఎత్తున కూచున్న మాకేసి చేతులు జాపి ఏదో ప్రాధేయపడుతూంది. పరిశీలనగా చూశాను. నేను కూర్చున్న పెట్టెలోంచి కిటికీగుండా బయటికి ఆ ఆకారంమీదికి పడుతూన్న వెలుగు సహాయంతో మరీ చూశాను.

ఆ వెలుగులో, నల్లగా ఓ పన్నెండేళ్ళ ముష్టి కుర్రాడు!

మాగిళ్లు కట్టిన చింపిరి జుట్టూ— కిటికీ వైపు ఆబగా ఆశగా చూస్తూన్న లోతు కళ్ళూ — నీరసంగా పీక్కుపోయిన మొహం. వెనుక్కి అంటుకుపోయిన పొట్టమీద నిలవలేక జారుతూన్న చిరుగుల నిక్కరూను.

వాడిదృష్టి ఇటు నా వైపులేదు. అటు అరవ ఆసామీ వీపు కనిపిస్తూన్న కిటికీ వేపే ఉంది. ఓ చేత్తో నిక్కరు పైకి

లొక్కుంటూ రెండో చేతిని అంతనిత్తులో ఉన్న కిటికీవేపుగా జాపుతున్నాడు.

మళ్ళీ ఇందాకటి మూలుగే వినిపించింది.

అయితే, మరి కొంచెం స్పష్టంగా, ఇంకొంచెం గట్టిగా—నూతిలోంచి వచ్చినట్లు బిరుపుగా అస్పష్టంగా వినిపిస్తూన్న ఆ మూలుగు ఈ కుర్రాడిదే అన్నమాట!... శ్రద్ధపట్టి జాగ్రత్తగా విన్నాను.

'బాబయ్యా...ఓ ముద్ద వెయ్యిబాబయ్యా!'

వాడు అదే శబ్దాన్ని హెచ్చించి మళ్ళీ మళ్ళీ గబగబా అంటున్నాడు. వాడి ఆకారాన్ని వాడు అంటూన్న మాటనీ చోద్యంగా చూస్తూ వింటూ కూర్చున్నాను.

ఆ ముష్టి కుర్రాడి పోరు ఎక్కువ కావడంతో ఆ అరవ అయన, వెనక్కి తిరిగి వాడికేసి ఓ మారు చూసి, వాడికి కనిపించకుండా ఉండడంకోసం అని బాగా లోపరికి జరిగి కూర్చుని, పెద్ద పెద్ద ముద్దలు చేసుకొని గబగబా మింగెయ్యడం ప్రారంభించాడు.

ఆ ముష్టి కుర్రాడు భలే గడుసువాడిలా ఉన్నాడు. అంతటితో ఆయన్ని వదలలేదు.

మా పెట్టికి బాగా దూరంగా వెనక్కి నడిచివెళ్ళాడు. కాళ్ళు ఎత్తిచూశాడు, అన్నం తినే అరవ ఆయన ఇంకా కనిపించలేదు కాబోలు, కాళీగా ఉన్న రైలు పట్టాలు ఎక్కి మరీ చూశాడు. దాంతో వాడికి ఒక అరవ అతనే కాదు అతని ప్రక్కని స్వీట్లు తింటూన్న బీహారీ, నా ప్రక్కని ఉన్న సిల్కు లాల్చీ ఆయనా, ఆయన భార్యకూడా కనిపించి ఉంటారు. ఇంక అరవ అతణ్ణి అడగడం మానేసి 'ఓ ముక్క పెట్టు బాబయ్యా ఓ ముద్ద పెట్టు అమ్మా' అంటూ, ఇందాకటిలా మూలగడం కాకుండా, గట్టిగా ఝుంకారంగా అరవడం మొదలుపెట్టాడు.

ఆ అరుపు విని అదిరిపడి, వాడి కళ్ళు సూటిగా వచ్చి తన మైసూరుపాకం మీదే పడుతున్నాయని గ్రహించి, వెంటనే బీహారీ కంగారుగా మొత్తం ముక్కనళంగా నోట్లో వేసుకుని మిగిలిన స్వీట్లు గబగబా మూట కట్టేశాడు.

'ఏం భోజనం వీడి మొహం! ఓ శుభ్రమైన కూరాలేదు, పెరుగూలేదు ఇదే ముష్టివెధవకో పడేసి, మనమో రెండు భోజనాలు రిఫ్రెష్‌మెంటులోంచి తెప్పించుకుంటే బాగుండిపోను' అంది వినుక్కుంటూ ఆ సిల్కులాల్చీ ఆయన భార్య.

'అమ్మా! ఓ ముద్ద అమ్మా!'

మళ్ళీ అరిచాడు ముష్టివాడు.

కంగారుగా, వాడి కళ్ళకి కేరియర్ కనిపించకుండా అటు పెట్టేసుకుంది ఆమె.

సిల్కులాల్చీ ఆయన కోపంగా వాడికేసి 'ఫో! ఫో!' అన్నాడు.

బీహారీ ఆయన మళ్ళీ హనుమాన్ చాలీసా తీసి నిర్మలమైన మనస్సుతో తిరిగి చదువుకోవడం ప్రారంభించాడు. అరవ అతను మాత్రం తిరిగి తిరిగి వెనక్కి ముష్టి కుర్రాడికేసి చూస్తూ తింటూన్న తైరు సాదం ముద్దలు నోటికి పోక అవస్థపడుతున్నాడు.

ముష్టికుర్రాడి ఆగడం క్షణక్షణానికీ ఎక్కువ కాసాగింది. వాడు రైలుబడ్డీమీద నుంచుని యింకాకాళ్ళ పైకెత్తి చూస్తూ 'అమ్మా ఓ ముద్ద! అమ్మా ఓ ముద్ద!' అంటూ గుండె లవిసేలాగ పిచ్చిగా అరుస్తున్నాడు.

సిల్కులాల్చీ ఆయన కోపంతో రెచ్చిపోయాడు. ఆ కోపంతో వళ్ళు తెలియని ఆవేశం తెచ్చుకుని మాటిమాటికీ భార్యని హెచ్చరిస్తూ, తానూ ఆమే కలిసి, కేరియర్‌లో అన్నాన్ని గబగబా తినేయసాగారు. కళ్ళతో మధ్య మధ్య ముష్టి కుర్రాడిని నంచుకుంటూ. వాళ్ళు అలా వెర్రిగా తినడం చూస్తే, ఆ కుర్రాడికి మరీ ఆకలి దహించుకుపోయినట్లుంది. 'అమ్మా ... బాబూ ...' అంటూ శోష వచ్చేలాగ అరవడం ప్రారంభించాడు. మధ్యలో పాపం ఆ అరవ ఆసామీ నలిగిపోతున్నాడు. ముష్టాడి కేకలు వింటూంటే అతనికి ముద్ద నోట్లోకి వెళ్ళడంలేదు. అంతా ఆ దంపతు లిద్దరూ తినేస్తే ఇంక తనకెక్కడ మిగలదో అని గబగబా అరిచేస్తున్నాడు ఆ కుర్రాడు 'అమ్మా...అమ్మా' అంటూ, ఇంక మీరు తినడం చాలులెండి. నాకు పెట్టండి అనే అర్థం వచ్చేలాగ.

సిల్కు లాల్చి ఆయన హూంకరిస్తూ లేచి కిటికీగుండా, చంపేసాన్నన్నట్లు ఆ కుర్రాడి కేసి చూసి, 'నువ్వు అర్చి చచ్చినా పెట్టం. అరవకుండా అవతలకి ఫో...ఒకటే అరుపు ఒకటే అరుపు, స్థిమితంగా రెండు ముద్దలు తిననియ్యకుండా... మరీ పొగరు ఎక్కువైపోయింది ప్రతి ముష్టి వెధవకీ' అంటూ సింహంలా గర్జించి అదే ఊపులో నాకేసి తిరిగి 'కిటికీ వేసెయ్యండి!' అన్నాడు. ఆ మాటే ఆయన సౌమ్యంగా అంటే ఒకవేళ వేసిఉందునేమో!

అటు ఆకలికీ ఇటు అన్నానికీ మధ్యనున్న తలుపు మూసెయ్యలేక, అలాగని చేసేదీలేక నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నాను.

అంతటితో నిరుత్సాహం చెందే కుర్రాడు కాదు వాడు—ఇలాంటి కేకలు ఎన్ని విన్నాడో, ఇలాంటి అవమానాలు ఎన్ని పడ్డాడో!... అసలేం జరగనట్లు మళ్ళీ మామూలుగా 'అమ్మా ఓ ముద్ద!' అంటూ అరిచాడు.

అలా ఒక్క వరసని తన వీపు వెనకాల అరుస్తూంటే, తనని కాదులే అని ఎంతసేపు ఊరుకోగలడు ఆ అరవ ఆయన మాత్రం?...ఎంత ప్రయత్నించినా ఆయన నోటికి ముద్ద ఎక్కడంలేదు.

ఆయనలో ఇంకా సజీవుడుగా ఉన్న మానవుణ్ణి చూసి నేను చిరునవ్వు నవ్వాను.

నా నవ్వు చూసి మొదట కళవళపడి, ఆ తర్వాత తనూ తేలిగ్గా నవ్వేస్తూ, అరవ యాసతో కూడిన దక్షిణాది తెలుగులో 'వీండ్లు నిండా గడుసువాళ్ళండీ!... తింటూంటే అడిగి తొందర పెడితే, వీండ్లకి పెట్టకుండా ఎట్లా తిందుము! కష్టంకదా?' అన్నాడు.

ఆయనలోని మంచితనం చూస్తే నాకు మళ్ళీ నవ్వువచ్చింది.

'ఈ సాదం కూడా ఏం రుచిలేదు... దుడ్లు తీసుకున్నాడు కాని మోసం...'

తర్వాత ఆయన ఏంచేస్తాడో నేను వెంటనే ఊహించాను. సరిఫ్గా ఆయన అలాగే చేశాడు. మిగిలిన అన్నం అంతా ఆకులో చుట్టిపెట్టి గట్టిగా ఆ ముష్టి కుర్రాడిదగ్గర పడేలా విసిరాడు. కాని ఆ కుర్రాడి దృష్టి యింకా ఆశగా సిల్కులాల్చీ దంపతులవేపే ఉందేమో, ఆ పొట్లం వచ్చి తనకి కొంచెం పక్కగా పడినచప్పుడు విని పిస్తేనేకాని అటు చూడలేదు.

కళ్ళు జిగేల్‌మన్నాయి!

రెండు పట్టాలమధ్యనా ఉన్న ఆ ~~~ మీద దివ్యకాంతి ఏదో వచ్చిపడింది. ఇంతలో ఆ పొట్లాన్ని చిక్కించుకుపోవడంకోసం ఎక్కడినుంచో వో కుక్క వచ్చి ఉరికింది.

వాడిలోని ఆకలి ఇంజనులా గర్జించి, గుండె రైలుచప్పుడులా కొట్టుకుంది.

కుక్క!

అన్నం!

కాంతి — చప్పుడు —

అమ్మో!...కుక్కతో పోటీపడి అన్నం పొట్లం మీదకి ఒక్కమాటుగా ఉరికాడు. పొట్లం దొరికింది. కుక్క పారిపోయింది. నల్లని ముష్టి కుర్రాడిమీద ఓ మెరుపులా మెరిసి, ఓ ఉరుము ఉరిమింది. అంతే!

*　　　*　　　*

గుండెలు బిద్దలయ్యే ముష్టి కుర్రాడి పచ్చి కేక! మృత్యువులా ముందుకు దూసుకుపోయిన సర్కార్ ఎక్స్‌ప్రెస్—

అంతా ఒక్క క్షణంలో—ఒక్క క్షణంలో—

నుతిపోయి సీటుకి కరుచుకుపోయాను నేను!

నాతోపాటు ఆ దృశ్యాన్ని చూసిన ఆ అరవ ఆయన భయంకరంగా ఒక్క పొలికేక పెట్టాడు!

అప్పుడే భోజనం పూర్తిచేసి త్రేపుమని త్రేనుస్తూన్న సిల్కు లాల్చీ ఆయన, నిస్తేజులుగా ఉండిపోయిన మా యిద్దరినీ, పక్కలైనుమీదికి మహావేగంగా వచ్చి ఆగుతూన్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌నీ ఒక్కమారు చూసి, క్షణంలో అంతా గ్రహించి 'ఎంతపని చేశావయ్యా ఆ అన్నం పొట్లం విసిరి?' అంటూ అరవ ఆతణ్ణి హంతకుణ్ణి చూసినట్టు చూశాడు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్ బాగా ముందుకు వెళ్ళి ఆగింది.

ముష్టి కుర్రాడి స్థానంలో, మాంసం ముద్దా, రక్తపు మడుగూ, అన్నం పేకట్‌ని గుప్పిడితో గట్టిగా పట్టుకొన్న ఒక చెయ్యీ మాత్రం మిగిలాయి.

ఎంతటి భయంకరమైన దృశ్యాన్నయినా సరదాగా చూడగలననుకొన్న నాకు, తల గిర్రున తిరిగిపోయింది.

పాపం అరవ ఆసామీకి తిన్న అన్నం అంతా వాంతి అయిపోయింది.

'ఆ దృశ్యం మనం చూడలేం' అంటూ సిల్కు లాల్చీ ఆయనా, ఆయిన భార్యా ముఖం అటు తిప్పుకొని కూర్చున్నారు.

రైలుపట్టాల మధ్య కుప్పగా పడిఉన్న ఆ మాంసపు ముద్దచుట్టూ కాకుల్లా జేరిన జనాన్ని చూచి, జరిగింది ఏమిటో అర్థంకాక, నోటిదాకా వచ్చిన అన్నం దక్కకుండా పోయినందుకు బాధగా జనం మధ్యనున్న అన్నం పేకెట్‌కేసి ఆశగా చూస్తోంది తన ఆకలి సమస్య ఇంకా తీరని కుక్క!

'మానవుడు కనుక్కొన్న యంత్రాలం మేం—తీరిస్తే కృతజ్ఞతతో అతని సమస్యని తీరుస్తాం కాని నీ సమస్యలు తీర్చేదాకా మాకేం?' అని కసిరినట్లు కూసి తన తోటి ఎక్స్‌ప్రెస్ చేసిన పనిని వెనకేసుకువస్తూ, నీరసంగా కదిలింది మా ఎక్స్‌ప్రెస్, తన ఆకలి యింకా తీరకపోవడంవల్ల హౌరాదాకా ఉన్న రైలుమార్గాన్నంతా మింగెయ్యాలనే ఆశతో.

ఆ తర్వాత కొంతసేపటికి కూత కూసి సర్కార్ ఎక్స్‌ప్రెస్ కూడా కదిలే వుంటుంది, కడుపు నిండిన రాక్షసి, త్రేవుమని త్రేన్చుకుంటూ బద్ధకంగా బయలుదేరినట్టు.

అందరికీ అన్నం పెట్టే అన్నపూర్ణలాంటి ప్రకాశం బేరేజీ, దాన్ని చూసికూడా బహుశా నవ్వేవుంటుంది తన మెర్క్యురీ కాంతులతో.